ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 09.04.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతి రహిత పనులు నిర్వహించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుక్కింగ్ విధానం రేపటి నుంచి అమలు లోకి రానుంది.

2. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అమరావతి – హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణానికి కేంద్రం ఈ రోజు ఆమోదం తెలిపింది.

3. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని 238 గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కోడింగ్ లో శిక్షణ అందించనుంది.

4. రాష్ట్రంలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది.

-------------------------

**స్లాట్ బుకింగ్**

రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతి, రహిత పనులు నిర్వహించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుక్కింగ్ విధానం రేపటి నుంచి అమలులోకి వస్తుంది. ఈ కొత్త విధానాన్ని 22 సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో ప్రయోగ ప్రాతిపదికన అమలు చేస్తారు. స్లాట్ బుకింగ్ ద్వారా ప్రజలు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను 10 నుంచి 15 నిమిషాల సమయంలో పూర్తి చేసుకోగలుగుతారు. తమకు అనుకూలమైన స్లాట్ ను వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చు. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 48 స్లాట్లను అందుబాటులో ఉంచుతారు. అత్యవసర సందర్భాలు ఎదురైనప్పుడు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల లోపు నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ విధానంలో రోజుకి 5 స్లాట్లు ఉంటాయి.

**డెస్క్**

-------------------------

**గ్రీన్ ఫీల్డ్**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అమరావతి – హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని హోం శాఖను కేంద్రం ఆదేశించింది. కాగా తెలంగాణలో ఇప్పటికే ప్రాంతీయ వలయ రహదారి ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ మొదలైంది.

**డెస్క్**

--------------------------------

**గురుకులాల్లో కోడింగ్**

రాష్ట్రంలో గురుకుల పాఠశాలలో కోడింగ్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్ తదితర సాంకేతిక అంశాలను బోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని 238 గురుకులాల్లో చదివే విద్యార్థులకు కోడింగ్ లో శిక్షణ అందించనుంది. పదో తరగతి మినహాయించి ఆరు నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు కోడింగ్‌లో శిక్షణ ఇస్తారు. దీనికోసం ఆర్పీఎఫ్ యూకే ఫౌండేషన్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విద్యాసంవత్సరంలో ప్రయోగాత్మకంగా మొయినబాద్ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ అందించారు. నైపుణ్యాభివృద్ధి, ప్రణాళిక, కార్యాచరణ, పర్యవేక్షణ తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమం ద్వారా 1.50 లక్షల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

**డెస్క్**

--------------------

**PM-WAVES:**

మనదేశంలో తొలిసారిగా నిర్వహించనున్న ప్రపంచ దృశ్య శ్రవణ వినోద శిఖరాగ్ర సదస్సు waves వల్ల భారత కళాకారులు కొత్తగా కధాంశాలు సృష్టించడానికి, వాటిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి అవసరమైన ప్రోత్సాహం లభిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలో నిన్న రైసింగ్ భారత్ శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడుతూ... మనదేశంలో అత్యంత

చైతన్యవంతమైన సృజనాత్మక పరిశ్రమలు చలనచిత్రం, పాడ్కాస్టింగ్, గేమింగ్, సంగీతం, మొదలైన వాటి గురించి ఆయన మాట్లాడుతూ వీటిని తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు క్రియేట్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

**(Byte - Narendra Modi)**

ప్రపంచంలోని అతిపెద్ద పరిశ్రమల్లో వినోద పరిశ్రమ కూడా ఒకటని, భవిష్యత్తులో ఈ రంగం మరింత వృద్ధి సాధిస్తుందని నరేంద్ర మోదీ అన్నారు.

**Nsd**

--------------------------

**మెట్రో రైలు ఎండీ**

హైదరాబాద్ మెట్రో రైలు ఎండీగా ఎన్వీఎస్ రెడ్డి పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో ఫేజ్ కి సంబంధించిన పనులు కీలక దశలో ఉన్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న ఎన్వీఎస్ రెడ్డి సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావించింది. దానికి అనుగుణంగా ఆయన పదవీ కాలాన్ని పొడిగించింది.

**డెస్క్**

**-------------------------**

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

-----------------------

**వంటగ్యాస్ ధరలు నిరసన**

గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టింది. రెండు రోజుల పాటు ఈ ఆందోళనలు నిర్వహిస్తామని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. వంట గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌కు 50 రూపాయల చొప్పున పెంచిన విషయం శ్రోతలకు తెలిసిందే. పెరిగిన ధరలు నిన్నటి నుంచే అమల్లోకి వచ్చాయి. ఇదిలా ఉండగా పెరిగిన సిలిండర్ ధరలను, పెట్రోల్, డీజిల్ పై విధించిన ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సీపీఐ నిరసన చేపట్టింది.

**డెస్క్/రాజన్న సిరిసిల్ల**

------------------------

**పోషణా పక్షం**

ప్రజల్లో పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడానికి, కేంద్ర ప్రభుత్వం చేసిన కృషిని తెలియజేస్తూ మహిళా, శిశు, సంక్షేమ శాఖ పోషణ్ పక్వాడా 7వ సంచిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సిద్ధిపేట జిల్లాలో ఈ నెల 22 వరకు నిర్వహించే

పోషణా పక్షం 2025ను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ కోరారు. ప్రతి ఒక్కరికీ సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు.

కాగా హన్మకొండ జిల్లాలో మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా 788 అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న పోషణ్ పక్వాడా కార్యక్రమం గురించి జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ..

**సౌండ్ బైట్: హన్మకొండ జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి**

రాజన్న సిరిసిల్ల జిల్లాను పోషకాహార లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు.

**సిద్దిపేట, వరంగల్, రాజన్న సిరిసిల్ల పీటీసి..**

-------------------------

**పోషణ పక్వాడా యాడ్**

కామారెడ్డి జిల్లాలో ఈ రోజు నుంచి 22 వరకు పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ICDS కామారెడ్డి ప్రాజెక్ట్ CDPO శ్రీలత తెలిపారు. ఆరోగ్య లక్ష్మి పథకంలో భాగంగా కామారెడ్డి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతి రోజు గర్భిణీలు, బాలింతలు, 3 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.

**పీటీసీ కామారెడ్డి**

---------------------

**ముద్రా రుణాలు**

ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం ద్వారా రాష్ట్రంలో గత పదేళ్ళలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 78 లక్షల 12 వేల మందికి రుణాలు అందించినట్లు ఆ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ V సుజాత వెల్లడించారు. ఈ పథకం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా సుజాత ఆకాశవాణికి తెలిపారు.

**(Soundbyte- సుజాత)**

ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం ఖమ్మం జిల్లాలో విజయవంతంగా అమలు అవుతోంది. చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసేవారు ఈ పథకం ప్రయోజనాలు పొందుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన లబ్ధిదారుడు కృష్ణ ఆకాశవాణితో తన అనుభవాలను పంచుకున్నారు.

**కృష్ణ సౌండ్ బైట్**

**PTC, Khammam**

----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. అదే విధంగా ఈరోజు, ఎల్లుండి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పలు

జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది. రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

**పీఎస్**

----------------------

**IPL-CRICKET:**

ఐపీఎల్ టీ20 క్రికెట్‌లో భాగంగా ఈరోజు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ జట్టు, రాజస్థాన్ రాయల్స్ జట్టుతో తలపడుతుంది. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుంది. నిన్న రాత్రి చండీగఢ్‌లో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు, చెన్నై సూపర్ కింగ్స్ జట్టును 18 పరుగుల తేడాతో ఓడించింది. కోల్ కతా ఈడెన్ గార్డెన్స్ లో నిన్న జరిగిన మరో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును 4 పరుగుల తేడాతో ఓడించింది.

**NSD**

----------------------

**యాదాద్రి భువనగిరి జిల్లా**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట కొండపై నిర్మించిన గోల్కొండ హస్తకళల విక్రయశాలను తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య శాఖ మేనేజింగ్ డైరెక్టర్ శైలజ రామయ్యర్ ఈ రోజు ప్రారంభించారు. హస్తకళ ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలని ఆమె సూచించారు. హస్తకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ

చెర్మెన్ నాయుడు సత్యనారాయణ,యదదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ఈఓ భాస్కర్ రావు, ఇతరులు పాల్గొన్నారు.

**యాదాద్రి PTC**

----------------------------

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తులు వింటారు.

---------------------------